క్లుప్తంగా

జాయింట్ సర్వే పరిశీలన

మిడ్జిల్: మండలంలోని వేములలో శుక్రవారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు పర్యటించారు. గ్రామంలో సర్వే నంబర్182లో జాయింట్ సర్వే పరిశీలన ఉండడంతో ఏడీతో కలిసి పర్యటించారు. నివేదికను సిద్ధం చేసి వెళ్లినట్లు మండల సర్వేయర్ ధన్వంతరి తెలిపారు. వారి వెంట తహసీల్దార్ రాజు, ఆర్ఐ అంబికా ఉన్నారు.

16న మెగా వైద్య శిబిరం



జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్‌లో దివంగత శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం ఏనుగొండ ఎస్‌వీఎస్ ఆస్పత్రి సౌజన్యంతో ఈనెల 16న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగుతుందన్నారు.

లక్కీడిప్‌లో కేటాయింపు



మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో రెన్యువల్ కానీ ఒక బార్‌కు నూతనంగా లైసెన్స్ జారీ చేయడానికి టెండర్లు ఆహ్వానించగా 49మంది వ్యాపారులు టెండర్‌దాఖలు చేశారు. నూతన లైసెన్స్ జారీ కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ లక్కీడిప్ తీయగా 24వ నెంబర్ కలిగిన మద్యం వ్యాపారికి బార్ దక్కింది. కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఈఎస్ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఏఈఎస్ నర్సింహారెడ్డి, సీఐ వీరారెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మిడ్జిల్: ప్రజలు వర్షాకాలంలో రోగాలబారిన పడకుండా వైద్యసిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పిల్లలందరికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్, జింక్ టాబ్లెట్లు పంచాలని, చేతులను శుభ్రంగా కడుక్కునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ అయ్యూబ్ ప్రసాద్, సునంద, దేవయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

రాజాపూర్: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్‌శశికళారెడ్డి 14మందికి కల్యాణలక్ష్మి, ఇద్దరికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం బాలానగర్‌లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత వహించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: విమాన ప్రమాద ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని, పౌరవిమానయాన మంత్రి రాజీనామాలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చనిపోయిన ఒక్కో కుటుంబానికి కోటిన్నర పరిహారంతోపాటు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, నాయకులు పాల్గొన్నారు.

మృతులకు ఘననివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సుప్రభాత్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెల్త్‌క్లబ్ కన్వీనర్ పాండురంగం మాట్లాడుతూ విమాన ప్రమాద ఘటన దేశ ప్రజలందరి మనుసులను కలిచివేసిందని మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరారు. సుప్రభాత్ హెల్త్‌క్లబ్ సభ్యులు, వాకర్లు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌పై కేసు

భూత్పూర్: మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వ బైక్ మెకానిక్ వద్ద పనులు చేస్తున్న 13ఏళ్ల బాలకార్మికుడిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశానుసారంగా గురువారం ఎండీ అంజద్ ఎన్జీఓ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్–2 ఎండీ అల్తాఫ్, మహిళా ఏఎస్‌ఐ సక్రి, పోలీసు సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని హోటల్, బైక్‌మెకానిక్, కిరాణా దుకాణాల్లో తనిఖీ చేశారు. శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారుల ఫిర్యాదు మేరకు రామలింగేశ్వర్ బైక్ మెకానిక్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల మేరకే నిర్మించాలి

మహమ్మదాబాద్: ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నాయపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈయనవెంట ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

మూతపడిన ఏకోపాధ్యాయ పాఠశాల



విద్యార్థుల్లేక మూతపడిన పాత కప్పెట ప్రాథమిక పాఠశాల



భగవాన్ తండా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం

- విద్యార్థులపై శ్రద్ధచూపక ప్రైవేట్ వైపు తల్లిదండ్రుల మొగ్గు
- మూతపడిన పాతకప్పెట పాఠశాల, భగవాన్ తండా అంగన్‌వాడీ కేంద్రం
- బడిబాటపై శ్రద్ధ చూపకపోడంతో ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులు

భూత్పూర్: ప్రభుత్వం జూన్ 2నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించినా కొన్ని పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం చేపట్టకపోవడంతోపాటు బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించడంలో ఉపాధ్యాయులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. శుక్రవారం మండలంలోని పాతకప్పెట ప్రాథమిక పాఠశాలను సాక్షి విజిట్ చేయగా.. మూతపడి ఉన్నది. పాతకప్పెట పాఠశాలకు గతేడాది నుంచి విద్యార్థులు రాకపోవడంతో పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లగా మూసి ఉంది. ఎంఈఓ పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధులకు గైర్హాజరవుతున్నా.. పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఎంఈఓ ఉషారాణిని వివరణ కోరగా పాత కప్పెట పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఉండడంతో కప్పెట పాఠశాలకు డిప్యూటేషన్ వేశానని ఎంఈఓ ఉషారాణి వివరించారు.

తెరుచుకోని అంగన్‌వాడీ

భూత్పూర్: ప్రభుత్వం అంగన్‌వాడీలకు లక్షలాది రూపాయలు వెచ్చించి చిన్నారులకు మధ్యాహ్న భోజనంతోపాటు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన ఉద్దేశ్యంతో గ్రామాలతోపాటు సమానంగా తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మండలంలోని కొత్తూర్ అనుబంధ గ్రామమైన భగవాన్‌తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ‘సాక్షి’ విజిట్ చేయగా.. మూతపడి కనిపించింది. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న టీచర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో క్లస్టర్ల వారీగా ఇద్దరు సూపర్‌వైజర్లున్నా వారు ఇంటి కే పరిమితం అవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలని తండా వాసులు కోరుతున్నారు.

డిసిల్టేషన్ ప్రక్రియను పూర్తిచేయాలి

- మున్సిపల్ ఆర్‌డీఎంఏ శ్రీనివాసరావు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కాల్వల డిసిల్టేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ కం అపిలేట్ అథారిటీ శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్, సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచనల మేరకు శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. నాగర్‌కర్నూలు రోడ్డు పెద్ద కాలువలో జరుగుతున్న డిసిల్టేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మినిట్యాంక్‌బండ్, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. నల్లగుంట వద్ద ఏ చర్యలు చేపట్టాలో తెలియజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, కుమ్మరిరాజు, నాయకులు రామ్మోహన్, నర్సింహులు పాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టాలి



దేవరకద్ర: వానకాలం ప్రారంభం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ముందస్తుగా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి కృష్ణ తెలిపారు. శుక్రవారం దేవరకద్ర పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఐడీసీఎఫ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తగా ఇంటింటికి తిరిగి ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య అందుతుందని.. రోగులు ప్రైవేట్ వైపు వెళ్లకుండా ప్రభుత్వ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ఓపీ రోగుల రిజిష్టర్‌లను పరిశీలించి ఇన్‌పేషంట్‌లకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శరత్, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

కారు, బైకు ఢీ

కొత్తపల్లి: కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొన్న ఘటన మండలంలోని దుప్పడిగట్టు శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి నుంచి గోకుల్‌నగర్‌కు బైక్‌పై వెళ్తున్న రాజప్ప, అనిల్ కుమార్‌రెడ్డిని కొత్తపల్లిలో నిర్మిస్తున్న మండల కార్యాలయ భవనాలను పరిశీలించేందుకు ఎదురుగా కారులో వస్తున్న కడప జిల్లావాసి మహేశ్వర్‌రెడ్డి ఢీ కొన్నాడు. బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్వీఎస్‌కు తరలించారు. పోలీసులు వచ్చి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: స్కూటీపై వెళ్తున్న మహిళను ఇద్దరూ యువకులు బైక్‌పై వెంబడించి..ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసు అపహరించారు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడకు చెందిన పద్మ ఈనెల 11న రాత్రి నూతనంగా నిర్మిస్తున్న ఇంటి దగ్గరకు స్కూటీపై వెళ్తుండగా అప్పన్నపల్లి బ్రిడ్జి కింద బృందావన్‌గార్డెన్ సమీపంలో ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై ఆమెను వెంబడించి మెడలో ఉన్న మూడు తులాల బంగారం చైన్ అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జడ్చర్లలో భారీ వర్షం



జడ్చర్ల: జడ్చర్లలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సిగ్నల్‌గడ్డ–నేతాజీ చౌరస్తా ప్రధాన రహదారి జలమయంగా మారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా పట్టణంలోని పలు కాలనీలు, రోడ్లు కుంటలను తలపించాయి. ఒక్కసారిగా కుండపోత వర్షం కురువడంతో పట్టణంలో ఎక్కడికక్కడ రాకపోకలు స్థంభిచిపోయాయి. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలను వర్షం నీరు ముంచెత్తడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులుపడ్డారు. పత్తి మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి.

అవినీతికి పాల్పడితే చర్యలు: ఎమ్మెల్యే యెన్నం



అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రెవెన్యూ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ట్రెసా సభ్యులకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ట్రెసా నూతన కార్యవర్గం శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నంను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. సమస్యలతో వచ్చే ప్రజలకు ఇబ్బందులకు గురిచేయొద్దని అలాంటి ఫిర్యాదులు వస్తే సహించేంది లేదని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ట్రెసా కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శంకర్, ట్రెసా సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలప్రసాద్, సునిల్, గాయత్రి, సువర్ణ, దేవేందర్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు: ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: ఇల్లు లేని అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. పూర్తయిన తర్వాత అదనంగా మరో 1000ఇళ్లను మంజూరు చేయిస్తానని చెప్పారు. కేసీఆర్ కమీషన్లు దండుకోవడం కోసమే కేసీఆర్ కాళేశ్వరాన్ని కట్టి రూ.లక్ష కోట్ల అప్పులు తెచ్చి వాటిని మననెత్తిన రుద్దారని ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శించారు. ఇప్పుడు విచారణ కమీషన్ ముందు కేసీఆర్ తనకేమీ తెలియదని, అంతా అధికారులే చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులకు నెలకు రూ.6వేల కోట్ల వడ్డీ కడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీహరి, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



అడ్డాకులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో, పట్టణాల్లో అభివృద్ధి పరుగులు తీస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన వందమంది బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే రోడ్లకు వేలాది కోట్లు, ఇటీవల విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు దాదాపుగా రూ.2వందల కోట్లు కేటాయించి సబ్‌స్టేషన్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు రేకులచౌడాపూర్ గ్రామానికి చెందిన బాలస్వామి, జానకిరాం, శాంతితోపాటు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు దుశ్యంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నీలకంఠ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

కాంగ్రెస్ టూ బీజేపీ టూ కాంగ్రెస్

ఇదిలా ఉంటే రేకులచౌడాపూర్‌కు చెందిన జానకిరాం అనే యువకుడు ఉదయం ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ నంచి కాంగ్రెస్‌లో చేరాడు. కాగా మండల కేంద్రానికి రాగానే మధ్యాహ్నం తిరిగి బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ సమక్షంలో బీజేపీలో చేరారు. అంతలోనే సాయంత్రం తిరిగి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య సమక్షంలో కాంగ్రెస్ కండువా వేసుకుని కాంగ్రెస్‌లోనే ఉంటానని వివరించాడు. ఈ యువకుడి వ్యవహారం మండలంలో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఎన్నికల వేడి మొదలైందంటూ నెటిజన్లు చెపుకొచ్చారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్: ప్రజా సంక్షేమమనే మా ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గండీడ్ మండల పరిధిలోని పెద్ద వార్వాల్, వెన్నచేడ్, మంసూర్‌పల్లి, కొండాపూర్, గండీడ్‌లో ఆయన పర్యటించారు. అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్ల నిర్మాణం, హైమాస్ట్ లైట్లు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన, భూభారతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిగ్రామంలో రోడ్లు వేయాలనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీవో దేవన్న, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్ బాలస్వామి, పీసీసీ సభ్యులు నర్సింహారావు, గండీడ్, మహమ్మదాబాద్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జితేందర్‌రెడ్డి, నారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు అనంతలక్ష్మారెడ్డి, డీసీసీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు భూపాల్, కాంగ్రెస్ పార్టీ గండీడ్, మహ్మదాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.



పెద్దవార్వాల్‌లో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

భూ సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో పేద మధ్యతరగతి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూభారతి గ్రామసదస్సుల ద్వారా రైతుల సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని చెబుతుందని.. న్యాయపరమైన కేసులు కూడా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని రైతుల మధ్య తగాదాలు లేకుండా పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

చిన్నచింతకుంట: డబ్బులు వ్యవహారంలో జరిగిన గొడవలో మంగలి శ్రీనుపై దాడి చేసిన ఈడ్గి వినయ్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ తెలిపారు. గతనెల11న ఇద్దరి మధ్య డబ్బుల వ్యవహారంలో మాటామాట పెరిగి ఘర్షణకు పాల్పడ్డారు. ఈ క్రమంలో మంగలి శ్రీనును వినయ్ తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

తడిసిన ధాన్యం తరలించారు

నవాబ్‌పేట: వరుస వర్షాలకు ధాన్యం తడుస్తున్న పట్టించుకోవడం లేదని.. రైతులు గగ్గోలు పెడుతున్న విషయాన్ని సాక్షిలో మళ్లీ తడిసిన ధాన్యం పేరుతో కథనం ప్రచురితమైంది. దీంతో శుక్రవారం సంబంధిత అధికారులు వెంటనే వచ్చి ధాన్యన్ని లారీలు, ట్రాక్టర్లలో లోడింగ్ చేశారు. వరుసగా మూడుసార్లు తడిసిన ధాన్యం విషయంలో ఆందోళన పడ్డ అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని దొడ్డిపల్లి, కూచూర్‌లో ధాన్యం రోడ్లపై అలాగే ఉంచడంతో వరుస వర్షాలతో ధాన్యం తడిసింది. దీంతో అన్నదాతలు తమకు ఆదుకోవాలని కోరడంతో అధికారులు స్పందించి ధాన్యం తరలించారు.



దొడ్డిపల్లిలో ధాన్యం తరలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు

జడ్చర్ల: పట్టణంలో ప్రమాదభరితంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఈనెల 9న టెర్రర్ ట్రాన్స్‌ఫార్మర్స్ శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. పట్టణంలో ప్రమాదభరితంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించారు. ఇటీవల స్థానిక సరస్వతీనగర్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తేలిన విద్యుత్ తీగకు తగిలి పదేళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన స్థానికులను తీవ్రంగా కలిసివేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర తీగలను సరిచేయడంతోపాటు వాటి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తీగలను సరిచేయడంతోపాటు చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేశారు.



సరస్వతీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల తీగలను సరిచేసి రక్షణ చర్యలు చేపడుతున్న సిబ్బంది

నేడు విద్యుత్ కట్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని 11 కేవీ టౌన్ 1 ఫీడర్ పరిధిలో చెట్ల కొట్టివేత కారణంగా శనివారం పట్టణంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ టౌన్ 3 ఏఈ అరుణ్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. పట్టణంలోని టీచర్ కాలనీ, శంకర్ లింగం హాస్పిటల్, నలందా ఆటోస్టాండ్, షాషాబ్‌గుట్ట, బీకే రెడ్డి కాలనీ, ఎస్‌పీ సుబ్బారెడ్డి స్కూల్, ఫారుక్ మజీద్, దోనల్ల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

టీపీఎస్‌ఎంఏఓ కన్వీనర్‌గా కరాటే మాస్టర్ చెన్నయ్య

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియా కన్వీనర్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సీనియర్ కరాటే మాస్టర్ ఎతిరె చెన్నయ్య శుక్రవారం తెలిపారు. హీరో సుమన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు. కన్వీనర్ పదవి రెండేళ్ల పాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియా అధ్యక్షులు సత్య శంకర్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సైదులు, ఉపాధ్యక్షులు కమలాకర్ ఉన్నారు.

రెవెన్యూ దరఖాస్తులు 31

నవాబుపేట: మండలంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో 31దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ సువర్ణ తెలిపారు. శుక్రవారం వేర్వేరుగా మండలంలోని లోకిరేవు, రేకులచౌడాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని ప్రజలకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే రైతుల సమస్యలను వినతుల రూపంలో తీసుకున్నారు. లోకిరేవులో 18, రేకులచౌడాపూర్‌లో 13 దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు.

దేవరకద్ర: మండలంలోని జీనుగరాలలో తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

మహమ్మదాబాద్: ప్రాథమిక స్థాయిలో గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి పథకాన్ని తీసుకొచ్చినట్లు తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గాదిర్యాల్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ హైమద్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నారాయణ, మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, కేశవులు, బాల్‌రాజ్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

గండీడ్: మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం అరుణదేవి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మల్లేశ్, వెంకటయ్య, సికిందర్, తుకారం, నాయకులు కొండయ్య, దాసరికుమార్, ఎఫ్ఏ పెంటయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ప్రాథమిక పాఠశాలలో కౌన్సిలర్ కుమ్మరి రాజు, హెచ్ఎం వనజ విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

కోయిల్‌కొండ: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోదన ఉంటుందని.. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో వెంకట్‌జీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సాముహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలొని మాట్లాడారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి: డీఈఓ



దేవరకద్ర: పాఠశాలలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుభ్రతపై శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. దేవరకద్ర మండలం నార్లోనికుంట్ల, బల్సుపల్లిలో పాఠశాలలో విద్యార్థులకు పలక, బలపం పంపిణీ చేసి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏఎంఓ శ్రీనివాసులు, ఎంఈఓ బలరాం, రిసోర్స్ పర్సన్ పవన్‌కుమార్, జీహెచ్ ఎంలు రమేశ్, నాగేంద్రమ్మ, రామలింగం, సిబ్బంది చంద్రశేఖర్, రాధిక, శారద పాల్గొన్నారు.

వందేళ్ల హైస్కూల్ మనందరికీ గర్వకారణం



జడ్చర్ల టౌన్: మనం నివసిస్తున్న పట్టణంలో వందేళ్ల హైస్కూల్ ఉండటం మనందరికీ గర్వకారణమని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శతాబ్ది సంబరాల్లో భాగంగా శుక్రవారం కమిషనర్ లక్ష్మారెడ్డితో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త ఇదే పాఠశాల పూర్వవిద్యార్థి అని తెలియగానే ఒక రకమైన భావోద్వేగానికి గురైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, హెచ్ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు సునీల్, గోపాల్, సయ్యద్ ఇబ్రహీం, పూర్వవిద్యార్థుల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు రవిశంకర్, కృష్ణ, బాబర్, పరమటయ్య, ఆనంద్, దత్తు, జయప్రకాశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వవిద్యను ప్రోత్సహించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పిల్లలకు పూర్వవిద్యను ప్రోత్సహించాలని డీడబ్ల్యూఓ జరీనాబేగం పేర్కొన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లిలో అంగన్‌వాడీలో తొలిఒడి–బడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పూర్వ విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామంలో తల్లిదండ్రులు, యువత కార్యక్రమాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్ సరితారాణి, టీచర్‌లు శశికల, మూవేంద్ర, హైమావతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ.. పిల్లల భవితకు పునాది

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రం పిల్లల భవితకు పునాదిలాంటిదని డీడబ్ల్యూఓ జరీనాబేగం అన్నారు. పట్టణంలోని బండ్లగేరి అంగన్‌వాడీ కేంద్రం–2లో శుక్రవారం అమ్మమాట– అంగన్‌వాడీ బాట నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు కవిత, కౌసల్య, రాజేశ్వరి, సరస్వతి, కుర్మమ్మ, భాగ్యవతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

భూత్పూర్: పోతులమడుగుకు చెందిన విద్యార్థిని (శ్వేత) అదృశ్యమైనట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వనపర్తిలో బీఎస్సీ నర్సింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నది. గురువారం మహబూబ్‌నగర్‌లోని పనుందని తల్లిదండ్రులు చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. నర్సింగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి (సిద్ధు)పై అనుమానం ఉందని, శుక్రవారం తండ్రి (లవన్న) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.